క్లుప్తంగా

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



విద్యుత్ శాఖ టౌన్ ఏఈ పుల్లయ్యను సన్మానిస్తున్న ఎస్ఈ, విద్యుత్ శాఖ సిబ్బంది

బేతంచెర్ల : అంకిత భావంతో విధులు నిర్వహిస్తే సమాజంలో గుర్తింపు లభిస్తుందని నంద్యాల జిల్లా విద్యుత్ ఎస్ఈ సుధాకర్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని షాదీఖానాలో టౌన్ ఏఈ పుల్లయ్య పదవీ విరమణ సన్మానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ సుధాకర్ రావు, డీఈ కమలాకర్ రావు, ఏడీ మధు సూదన్ రెడ్డి, రూరల్ ఏఈ శ్రీనివాసులు, విద్యుత్ సిబ్బంది ఆధ్వర్యంలో టౌన్ ఏఈ పుల్లయ్యను ఘనంగా సత్కరించారు. పలువురు ఆయన సేవలను కొనియాడారు.

సమస్యలు పరిష్కరించాలి



నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డికి సమస్యలను వివరిస్తున్న మహిళలు

బేతంచెర్ల : పట్టణంలోని బోయపేట కాలనీలో సమస్యలను పరిష్కరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి కాలనీ మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శివాలయం విధి పక్కనున్న రహదారి దెబ్బతిని గుంతలమయంగా మారడమే కాకుండా ఎలుకలు, పంది కొక్కులు స్వైర విహారం చేస్తున్నాయని మహిళలు విన్నివించారు. సామూహిక మరుగుదొడ్లను శుభ్రం చేయడం లేదని, తాగునీటి సమస్య ఉందని తెలిపారు. సమస్యలను పరిష్కరిస్తామని తెలిపి, సంబంధిత సిబ్బందితో ఫోన్లో మాట్లాడారు.

బదిలీ ఉపాధ్యాయినులకు సన్మానం



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినులను బుధవారం ఘనంగా సన్మానించారు. హెచ్ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల రిటైర్డ్ హెచ్ఎం బాలగంగధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాల నుంచి బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయినులు పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేశారని కొనియాడారు. అనంతరం బదిలీ అయిన షహనాజ్ బేగం, లక్ష్మీనారాయణమ్మ, లలితమ్మ, సరోజమ్మ, వరలక్ష్మీ, శ్రీదేవి, నాగమణిని సన్మానించారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : మండలంలోని చిన్నరాజుపాళెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెద్దస్వామి నాయక్ (92) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి బుధవారం మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. పెద్దస్వామి నాయక్ కుమారుడు ఈశ్వర్‌నాయక్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం కార్యదర్శిగా ఉండగా, ఆయన కోడలు మానసవీణ బనగానపల్లె ఎంపీపీగా కొనసాగుతున్నారు. పార్టీ మండల కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, పసుపల సర్పంచ్ మోహన్‌బాబు, నాయకుడు కోడూరు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేములకు చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డిగారి నారపరెడ్డి (85) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృత్యువాతపడ్డారు. మృతదేహాన్ని బుధవారం స్వగ్రామానికి తరలించగా విషయం తెలుసుకున్న బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామాన్ని చేరుకుని మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ కార్యవర్గ ఎన్నిక

డోన్ : ఇన్నర్‌వీల్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని బుధవారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2025 –26 ఆర్థిక సంవత్సరానికి క్లబ్ అధ్యక్షురాలిగా శకుంతలారెడ్డి, కార్యదర్శిగా విజయలక్ష్మిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గుంతకల్ ఇన్నర్‌వీల్‌క్లబ్ సభ్యురాలు వరలక్ష్మి తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షురాలు రాజా సుజాత, ముడియాల శైలజ, సుమిత్ర రాజేష్ పాల్గొన్నారు.

సిరులు కురిపించే.. 'చిరు' సాగు!



పసుపల వద్ద సాగులో ఉన్న రాగి పంట



విరలాపురం సాగైన ఊద పంట

బనగానపల్లె: ప్రస్తుత ఆహారం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుండటంతో మళ్లీ పాత ఆహారానికి మళ్లుతున్నారు నేటి జనం. ఇప్పటికే నాటి పంటలను మరచిపోయిన రైతులు మళ్లీ ఆ పంటల సాగుకు పూనుకుంటున్నారు. ఆయా పంటలకు తక్కువ మందులు, ఎరువులు అవసరమవుతుండటంతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంలో మంచి ధర లభిస్తోంది. చిరుధాన్యాల్లో పోషకాలుండటంతో ఆ పంటలను సాగు చేస్తున్న రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈ పంటలు తక్కువ వర్షపాతం గల ప్రాంతాల్లో సైతం పండుటుండటంతో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు వాటి సాగుకు రైతులు మొగ్గు చూపేలా అవగాహన కల్పిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు నంద్యాల జిల్లాల్లో సుమారు 8 వేల హెక్టార్లలో ఈ పంటల సాగు ఉండగా బనగానపల్లె నియోజవర్గంలో సుమారు 600 హెక్టార్లలో ఈ పంటలు సాగవుతున్నాయని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

అధిక దిగుబడులే లక్ష్యం..

ఆధునిక ప్రపంచంలో అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వినియోగం పెరిగింది. ఫలితంగా భూమిలో రసాయన అవశేషాలు నిండి ఏటేటా పంట దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఇలా సాగు చేసిన ఆహార పంటల్లో కూడ రసాయన అవశేషాలు ఎక్కువ ఉన్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఫలితంగా ప్రజల్లో వ్యాధుల సంఖ్య ఎక్కువ అవుతోంది. నాడు కొర్ర, వరిగ,సామలు,అరికలు, ఊదలు, రాగి, సజ్జ,జొన్న పంటలను అధికంగా సాగు చేయడమే కాకుండా వాటినే ఆహారంగా తీసుకునేవారు. ప్రస్తుతం నాటి జనం ఆరోగ్యంగా ఉండటానికి కారణమైన ఈ చిరుధాన్యాలను వాడటం పెంచారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం సాగుకు తగిన విధంగా ప్రోత్సహించే చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ఒకప్పుడు పేదలు,మధ్య తరగతి ప్రజల ప్రధాన ఆహారం చిరుధాన్యాలు. మూడు నాలుగు దశాబ్దల క్రితం వరకు వీటి వినియోగం అధికంగా ఉండేది. వీటిని రసాయానిక ఎరువులు పురుగు మందులు వాడకుండా పశువుల ఎరువు, చెరువుమట్టి, సేంద్రియ ఎరువులతో పంటలు పండించేవారు. ఫలితంగా వీటిని వాడే ప్రజల్లో రోగనిరోధక శక్తి సాధారణంగానే ఎక్కువగా ఉండేది. తదనంతర వచ్చిన మార్పులతో ఏటేటా చిరుధాన్యాల సాగు తగ్గుతూ వచ్చింది. చాలా మంది రైతులు అధిక ఆదాయం కోసం వరి, పత్తి, మిరప తదితర వాణిజ్య పంటల సాగుకు మొగ్గు చూపుతుండటం వల్ల చిరుధాన్యాల సాగు అంతరించింది. రైతులు ఇష్టానుసరంగా ఎరువులు, పురుగుల మందుల వాడటం మొదలు పెట్టారు. ఫలితంగా సాగు ఖర్చు పెరిగి దిగుబడలు తగ్గాయి. భూమి కూడా విషతుల్యంగా మారుతుండటంతో దీనిని తగ్గించేందుకు చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని నిపుణులు సూచించడంతో ప్రస్తుతం అన్నదాతలు చిరుధాన్యాల సాగును పెంచడం ప్రారంభించారు.

పెట్టుబడి తక్కువ..

కొర్ర,వరిగ,సామలు,అరికలు, ఊదలు, రాగి, సజ్జ, జొన్న పంటల సాగుకు ఎకరాకు రూ.10వేలకు మించదు. అయితే దిగుబడి మాత్రం ఎకరాకు ఐదు క్వింటాళ్లకు పైగానే వస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో నాణ్యతను బట్టి క్వింటా రూ.3,800 నుంచి రూ.4,700కు పైనే పలుకుతుండటంతో రైతులకు బాగా మిగులుతుంది. అలాగే.. పంట సాగుకు శ్రమకూడా తక్కువగా ఉంటుంది.

నాడు మద్దతు ధర ఇలా..

జొన్న రాగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గతంలో మద్దతు ధర ప్రకటించింది. హైబ్రిడ్ జొన్నలకు క్వింటా రూ.3,180 కాగా సాధారణ జొన్నలు క్వింటా రూ.3,225, రాగులు క్వింటాకు రూ.3,846 ప్రకటించింది. ఆ పంటలను మద్దతు ధరతో సివిల్ సప్లయీస్ శాఖ కొనుగోలు చేసింది. అయితే చిరుధాన్యాల పంటలకు కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు మద్దతు ధర ప్రకటించకపోవడంతో సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలి



రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై ఆసక్తి చూపాలి. ఈ పంటల సాగు వల్ల పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగి రైతుకు లాభసాటిగా ఉంటుంది. వీటి వినియోగం వల్ల ప్రజలు ఆరోగ్యవంతులుగా మారతారు. ప్రస్తుతం కర్షకులు వాణిజ్య పంటల పై మొగ్గు చూపుతున్నారు. ఈ పంటలకు విరివిగా ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడటం వల్ల పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గుతున్నాయి. వీటి నివారణకు చిరుధాన్యాల పంటల సాగుపై గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నాం.

– సుధాకర్, వ్యవసాయ శాస్త్రవేత్త, కేవీకే, యాగంటిపల్లె, బనగానపల్లె మండలం

చావిళ్లలో కొలువైన పీర్లు



పాతపేటలో కొలువైన దస్తగిరి స్వామి

డోన్ : పట్టణంలో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. మతసామరస్యానికి ప్రతీకగా, కుల, మతాలకు అతీతంగా అత్యంత వైభవంగా వారం రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. పట్టణంలోని పాతపేటలో, తారకరామనగర్ దస్తగిరి స్వామి పీర్లు కొలువయ్యాయి. మిగిలిన 8 చోట్ల గల పీర్లచావిడీలలో పీర్లు కొలువుదీరాల్సి ఉంది.

కొలువుదీరిన పీర్లు

కోవెలకుంట్ల: మొహర్రం సందర్భంగా స్థానిక మేజర్ గ్రామ పంచాయతీతోపాటు మండల గ్రామాల్లోని చావిళ్లలో పీర్లను కొలువుంచారు. పట్టణంలోని రంగరాజుపేట, సంతపేట, చిన్నబార్ ఇమాం, పెద్దబార్ఇమాం చావిడి, జెండామాను వీధి, బాబానగర్, ఆంజనేయస్వామి దేవాలయం వీధి, బసిరెడ్డి బావి వీధుల్లోని ఆయా చావిళ్లలో బీబీ ఫాతిమా, బాదుల్లా, ఇమాంకాశీం, చిన్నబార్ఇమాం, పెద్దబార్ ఇమాం, ఇమాంకాశీం, హజరత్ అబ్బాస్, మౌలాలిస్వామి, ఉద్దం ఇమాంకాశీం, అలీ అక్బర్ పీర్లను కొలువుంచారు. ఆయా కాలనీలకు చెందిన భక్తులు పూలదట్టీలతో ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కొలిమిగుండ్ల: తిమ్మనాయినపేట,బందార్లపల్లె, మీర్జాపురం తదితర గ్రామాల్లోని చావిళ్లలో పీర్లను కొలువుదీర్చారు. శనివారం చిన్న సరిగెత్తు,సోమవారం పెద్ద సరిగెత్తు,మంగళవారం పీర్లను నిమజ్జనం చేయనున్నారు.

స్కూల్ బస్సులు భద్రతా ప్రమాణాలు పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న క్రాంతికుమార్

డోన్ టౌన్ : విద్యార్థులను తరలించే వాహనాలు, స్కూలు బస్సులు నిబంధనలు పాటించడంతో పాటు భద్రతా ప్రామాణాలను పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలో స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. రెండు ప్రైవేట్ విద్యా సంస్థలకు సంబంధించిన బస్సులకు ఇన్సురెన్స్, అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన కిట్లు లేక పోవడంతో జరిమానా విధించారు.

జగనన్న కాలనీలను అభివృద్ధి చేయాలి

డోన్ టౌన్ : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన జగనన్న కాలనీను అభివృద్ధి చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, ఐద్వా నాయకురాలు షమీమ్ బేగం కోరారు. బుధవారం పట్టణ సమీపంలోని దొరపల్లె గ్రామ వద్ద ఉన్న జగనన్న కాలనీలో పర్యటించి నివాసితులు, లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాదేవి, హుస్సేన్‌బీ, నాగసుబ్బమ్మ, లక్ష్మిదేవి, రాజు, హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై విచారణ

బేతంచెర్ల : మండలపరిధిలోని కొమ్మురి కొట్టాల ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నాగలక్షమ్మను విద్యార్థుల తల్లి దండ్రుల సమక్షంలో ఎంఈఓ సోమశేఖర్, ఎస్ఐ రమేష్ బాబు బుధవారం విచారించారు. 37 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులకు నాగలక్షమ్మ అరకొరగా భోజనం పెట్టడమే కాకుండా పాఠశాలో తాను చెప్పిన పని చేయకపోతే తిట్టడం లాంటి పనులు చేస్తోంది. ఎందుకిలా చేస్తున్నావని అడగటానికి వెళ్లిన విద్యార్థుల తల్లిదండ్రులతో గొడవ పడుతోంది. దీంతో తల్లి దండ్రుల ఫిర్యాదు మేరకు ఎంఈఓ సోమశేఖర్, ఎస్ఐ రమేష్ బాబు బుధవారం వెళ్లి విద్యార్థులను, తల్లిదండ్రులను విచారించారు. కాగా, విచారణకు కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు మాత్రమే వచ్చారని, గురువారం అందరితో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని ఎంఈఓ వెల్లడించారు.

అధికారుల సూచనలు పాటించాలి

బనగానపల్లె రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగులో రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచలను, సలహాలను పాటించాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని టంగుటూరు,నందవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు నివారణ చర్యలను వివరించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శ్రీరాములు

అవుకు: మండల ఎంపీడీఓగా విధులు నిర్వహించిన వెంగన్న ఇటీవల పదవీ విరమణ పొందారు. దీంతో అవుకు ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉండటంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీరాములుకు జిల్లా అధికారులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పగించారు. బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 98.02శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని, మండలంలో 6,571మంది లబ్ధిదారులు ఉండగా 6,441 మందికి పింఛన్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

యాగంటి వేలాలు వాయిదా

బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో రుద్రాక్ష మాలలు, రక్షాధారణలు, కరుంగలి మాలలు, రాగికడియాలు విక్రయించుకునేందుకు బుధవారం నిర్వహించాల్సిన బహిరంగ వేలాలను వాయిదా వేసినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి తెలిపారు. అనివార్య కారణాలతో వాయిదా పడ్డాయని, మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం

డోన్ : రోటరీక్లబ్ సిల్వర్‌జూబ్లీ(25 ఏళ్లు) పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక క్లబ్‌లో గురువారం నుంచి 5వ తేదీ వరకు ఆక్యుప్రెషర్, మాగ్నిటిక్ వైబ్రేషన్ సూజోక్ ఉచిత చికిత్సల శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజా విజయ్‌కుమార్, అధ్యక్షుడు జింకల కృష్ణ, కార్యదర్శి బలరాం తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు ఆపరేషన్, ఔషధాలతో అవసరం లేకుండా, ఎలాంటి సైడ్ ఎఫెక్టులకు గురికాకుండా వైద్యులు ప్రమోద్‌కుమార్ చికిత్సను అందజేస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు

డోన్ టౌన్ : సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్చకూడదని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు బుధవారం పార్టీ కార్యాలయం ఓ ప్రకటన జారీ చేసింది. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురువారం ఉదయం 9.30 గంటలకు మంత్రి స్వగృహానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల పరిశీలన



సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్ : స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలోని లక్ష్మీకాంతరెడ్డి వీధిలో మున్సిపల్ సాధా రణ నిధులను వెచ్చించి చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, డీఈ రఘు, ఏఈ సురేష్, కౌన్సిలర్ మిట్టా ఉమామహేశ్వరిలు పరిశీలించారు. రూ.5లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీలను నిర్మిస్తున్నట్లు వారు తెలి పారు. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయా లని చైర్మన్ అధికారులను ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ మిట్టా రవి ఉన్నారు.

ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు సత్రాల కూల్చివేత



అక్రమిత సత్రాలను కూల్చివేసిన దృశ్యం

బనగానపల్లె రూరల్ : మండలంలోని నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయానికి సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన కంచర్ల మారుతి సత్రం,గట్టు వెంకటరాముడు సత్రాలను ఏపీ ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఉత్తర్వుల మేరకు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేశారు. ఈఓ మాట్లాడుతూ దేవస్థానానికి చెందిన భూములు, స్థలాలు అక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామని చెప్పారు.డీఈఓ మోహన్,పంచాయతీ కార్యదర్శులు,నందివర్గం పోలీసులు ఉన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు అమలు చేయాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

కోవెలకుంట్ల: మాతా, శిశుమరణాల రేటును పూర్తిగా తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను వందశాతం అమలు చేయాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ సూచించారు. బుధవారం మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వసతులు, మందులు, సిబ్బంది పనితీరును డాక్టర్లు మహబూబ్ సుభాని, దివ్యజ్యోతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలంలోని కలుగొట్లలో నిర్వహించిన ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, ప్రభావతి, స్టాఫ్‌నర్స్‌లు మరియమ్మ, చెన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ మమత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడుతున్నాం

కోవెలకుంట్ల: గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పాటుపడుతోందని రోడ్లు, భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గుళ్లదూర్తిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలకు తావులేకుండా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ వరప్రసాదరావు, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

నూతన అవిష్కరణలపై దృష్టి సారించాలి

బనగానపల్లె రూరల్ : విద్యార్థులు నూతన అవిష్కరణలపై దృష్టిసారించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ సమన్వయకర్తలు డాక్టర్ ఎస్ మహమ్మద్‌గౌస్, ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. అధ్యాపకులు డాక్టర్ సూర్య నారాయణరెడ్డి సుధాకర్‌రెడ్డి, కౌసల్యదేవి, బడేసాహెబ్, నీతమ్మ,రామకృష్ణ,వరలక్ష్మీ పాల్గొన్నారు.

పైర్లకు ఊపిరి పోసిన వర్షం



మొక్కజొన్న పొలంపై కురుస్తున్న వర్షం



బనగానపల్లె సమీపంలో మొక్కజొన్న పొలంలో కురిసిన వర్షం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు మండలాల్లో బుధవారం కురిసిన వర్షం ఖరీఫ్ పంటలకు ఊపిరి పోసింది. సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, మినుము, కంది, తదితర పంటలు సాగు చేశారు. విత్తనం వేసినప్పటి నుంచి వరణుడు ముఖం చాటేయడంతో రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సాగు చేసిన పంటలతోపాటు ఈ నెలలో సాగు చేయాల్సిన పైర్లకు వర్షం అనుకూలంగా మారటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లె: వర్షం కోసం ఎదురుచూస్తున్న తరుణంలో బుధవారం సాయంకాలం కురిసిన భారీ వర్షం పంటలకు ప్రాణం పోసిందని రైతులు పేర్కొంటున్నారు. బనగానపల్లె ప్రాంతంలో సుమారు మూడువేల హెక్టార్లలో మొక్కజొన్న పంట, రెండువేల హెక్టర్లలో పత్తి, మిరప తదితర పంటలను రైతులు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రవేశించి నెల గడిచినా వరుణుడు కరుణించనందున వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్న తరుణంలో కురిసిన వర్షంతో పైర్లు ఊపిరి పోసుకున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అంతా నాఇష్టం !

- బేతంచెర్ల నగర పంచాయతీలో కమిషనర్ ఇష్టారాజ్యం
- విధులు నిర్వహిస్తున్న కార్మికులను తొలగించి కొత్తవారిని తీసుకునే యత్నం



బేతంచెర్ల నగర పంచాయతీ కార్యాలయం

బేతంచెర్ల: పట్టణంలోని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ అంతా నాష్టం అన్నట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను తొలగించి, కొత్త వారిని ఆప్కాస్ ద్వారా తీసుకోవాలని కమిషనర్ ప్రయత్నిస్తుండగా దీనిని చైర్మన్‌తో పాటు వార్డు కౌన్సిలర్లు, కార్మిక సంఘం నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఉన్నవారిని కాదని కొత్తవారిని ఏవిధంగా తీసుకుంటారని కమిషనర్‌ను నిలదిస్తున్నారు. ముఖ్యంగా తనకు నచ్చినట్లు కమిషనర్ తీసుకునే నిర్ణయాల వల్ల కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న తమను కాదని కొత్త వారిని విధుల్లోకి తీసుకుంటే వామపక్షాల నాయకులతో కలిసి ఆందోళనకు దిగుతామని కార్మికులు హెచ్చరిస్తున్నారు. ఆప్కాస్ ద్వారా తీసుకోవాలనుకుంటే తమకే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. పాత వారిని కాదని కొత్తవారిని తీసుకుంటే ఆందోళన చేపడతామన్నారు. గతంలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన వారి కుటుంబ సభ్యులతో పాటు ప్రస్తుం కంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఆప్కాస్ ద్వారా విధుల్లోకి తీసుకోవాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున్న కార్మికులతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్‌ను వివరణ కోరగా.. పాత వారిని, కొత్తవారిని అందరినీ ఆప్కాస్ ద్వారా తీసుకుంటామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : మండలంలోని మల్యాల సబ్ స్టేషన్ పరిధిలో రూరల్ డెవలప్‌మెంట్ కింద పనులు జరుగుతున్నందున 11 కేవీ లైన్ పనులు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పనుల కారణంగా గురువారం మల్యాల, సీసంగుంతల గ్రామాలకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రైతులకు ఇచ్చే త్రీఫేజ్ కరెంటు తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 11 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉంటుందని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

డోన్ టౌన్ : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, డోన్ నియోజకవర్గ కార్యదర్శి అబ్బాస్, సీపీఐ పట్టణకార్యదర్శి మోటా రాముడు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి ప్రభాకర్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టి న నిరాహార దీక్షలను సందర్శించి వారికి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, గౌస్, అజయ్‌రెడ్డి, రవికుమార్, సంజీవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

కోవెలకుంట్ల: మండలంలో గురువారం ప్రైవేట్ పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ పాఠశాలల యాజన్యాలు తెలిపాయి. ఆర్టీఈ12(1)(సీ), బలవంతపు చేరికలు, అన్యాయమైన నోటీసులు వంటి అంశాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. పాఠశాలల హక్కులు, విద్యార్థులు, సిబ్బంది హితాలను కాపాడటానికి సెలవు ప్రకటించి నిరసన తెలియజేస్తున్నామన్నారు.

కేసు నమోదు

బనగానపల్లె : మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్‌పై దాడి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య బుధవారం తెలిపారు.ఎస్ఐ వివరాల మేరకు కొమ్ము శేఖర్ తాగుడుకు బానిసై తన భార్య రమాదేవిపై అనుమానంతో మానసికంగా వేదింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంలో భార్య భర్తలు గత రెండు రోజుల క్రితం గొడవపడుతుండగా రమాదేవి తల్లి నారాయణమ్మ అడ్డు వచ్చింది. దీంతో కొమ్ముశేఖర్, కొమ్ము మహేష్.. నారాయణమ్మను కొట్టి చంపుతానని బెదిరించారు. నారాయణమ్మ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అవుకు: మండలంలోని రామాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ రాజారెడ్డి బుధవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి బాలయ్య (51) బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా తాడిపత్రి నుంచి వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో కిందపడ్డాడు. దీంతో తీవ్ర గాయమై మృతి చెందాడు. భార్య చాకలి హుసేనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటున్న అధికారులు

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్ తెలిపారు. కొద్ది రోజుల నుంచి గ్రామంలోని కొన్ని కాలనీల్లో తీవ్రమైన నీటి సమస్య ఏర్పడటంతో మహిళలు ఖాళీ బిందెలతో అనంతపురం–అమరావతి జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం డీఈ మధుసూదన్,ఎంపీడీఓ ప్రసాదరెడ్డి,కొలిమిగుండ్ల,బనగానపల్లె ఏఈలు కరీముల్లా,సాయికృష్ణతో కలిసి చింతలాయిపల్లె రోడ్డుకు చేరుకొని నీటి సమస్యపై ప్రజలతో చర్చించారు. మదనంతపురం సమీపంలోని బోర్లలో భూగర్భ జలాలు అడుగంటడంతో కాలనీలకు నీటి సమస్య ఏర్పడుతుందని గుర్తించారు. పైపులైన్‌లు లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అవుకు సీపీడబ్ల్యూస్కీం నుంచి నీళ్లను నేరుగా కుళాయిలకు సరఫరా చేయకుండా ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు పంపింగ్ చేసి అందించాలని సూచించారు.